

తిరుమలలో గోగర్భం జలాశయం గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి తిరుమల

తిరుమల శ్రీవారి క్షేత్రంలో జలకళ సంతరించుకుంది.. మాండౌస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు అన్ని ప్రధాన జలాశయాలు నిండాయి..సోమవారం మాధ్యాహ్ననికి గోగర్భం పూర్తి స్థాయిలో నిండిపోవడంతో నీటి శాఖ అధికారులు గేట్లను ఎత్తివేసి నీటిని వదిలారు..ఇన్ ఫ్లోను అంచనా వేసి ఒక గేటును ఎత్తారు..ఇప్పటికే పాపనాశనం, కుమార ధార, పసుపు ధార జలాశయాలు నిండాయి..



వీడని వర్షం..!

- మరో 48 గంటలు అప్రమత్తం
- లోతట్టు ప్రాంతాల్లో సహాయ చర్యలు
- పారదర్శకంగా నష్ట అంచనాలు
- కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, యంత్రాంగం

మాండూస్ తుపాను నేపథ్యంలో చిత్తూరు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదయ్యింది. మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపడుతూనే, చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. పంట నష్టం అంచనాలను పారదర్శకంగా వేయాలని ఆదేశించారు.

సోమవారం జేసీ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్ఒ ఎన్.రాజశేఖర్‌లతో కలిసి తుపాను సహాయ చర్యలు, నష్టాల అంచనాలపై ఆర్డీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ, మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని



సోమలలో నీట మునిగిన పైరు

జడ్‌పిసిఇఒ, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ శాఖ వారు పర్యవేక్షించాలన్నారు. స్కూళ్ల పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే మార్గాల్లో వాగులు, వంకలు పారుతున్న ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ ట్యాంకుల స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నీరు మొరవ పారే ప్రదేశాలను గుర్తించి వెంటనే స్పందించాలన్నారు. ఎక్కడైనా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లయితే వారిని సురక్షిత ప్రదేశాలకు తీసుకెళ్లి పర్యవేక్షించాలన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా నివారించాలని ఆదేశించారు.

నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కల్వర్టులు, కాజ్‌వేల వద్ద సిబ్బందిని నియమించి పర్యవేక్షిస్తున్నామని నగరి ఆర్‌డిఒ కలెక్టర్‌కు వివరించారు. చిత్తూరు, గుడిపాల మండలాల్లో అధిక వర్షపాతం నమోదయ్యిందని, సహాయ చర్యల్లో తహశీల్దార్లకు తగు సూచనలు చేసి వారి సమన్వయంతో సమాయ చర్యలు చేపడుతున్నామని చిత్తూరు ఆర్డీవో తెలిపారు. గార్గేయ, కౌండిన్య, పాలారు నదుల్లో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను అప్రమత్తం చేసి నీటి ప్రవాహ ఉధృతి అధికంగా ఉన్న ప్రదేశాల్లో వాగులు, వంకలు దాటకుండా చూస్తున్నామని పలమనేరు ఆర్డీవో వివరించారు.



నేలకొరిగిన తమలపాకు పంట పొలంలో లక్ష్మమ్మ, పంట పోలాన్ని పరిశీలిస్తున్న సుధాకర్ రావు ఎంపీడీవో , సిబ్బంది

కార్వేటినగరంలో ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. కూలీలకు పనులు లేక ఇబ్బందులు తప్పలేదు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన చెరకు కూలీల ఇబ్బందులు వర్ణనాతీతం. వృద్ధులు ఈదురుగాలులు తట్టుకోలేక వణుకుతున్నారు. ఎక్కడికక్కడ నీరు నిలిచి కుంటలను తలపిస్తోంది. పంటలు నేలకొరిగాయి. దిగువ ప్రాంతాలైన సురేంద్రనగరం, డిఎంపురం, కెఎం పురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లి, లక్ష్మీరాజపేట పంచాయతీల్లో తీవ్రత అధికంగా ఉండడంతో మిరప, వేరుశనగ పంటలు నీటమునిగాయి. అదేవిధంగా యర్రమరాజుపల్లి, గాజంకి, కెపి అగ్రహారం, జాండ్లపేట గ్రామాల్లో తుపాను దాటికి వేరుశనగ పంట నీట మునిగింది. తుమ్మలచెరువు కాల్వ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. గంటావారిపల్లికి చెందిన లక్ష్మమ్మ తమలపాకు తోట నేలకొరిగింది. రామకుప్పం మండల పరిధిలోని మణింద్రం పంచాయతీ అత్తికుప్పం గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆచారి, పద్మ దంపతులు కూలి పనులు చేసుకుంటూ చిన్నపాటి ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. ఇంటిగోడలు సోమవారం ఒక్కసారిగా పెద్దశబ్దం చేస్తూ కూలిపోయాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. నిలువ నీడ లేకుండా పోయిందని ఆ దంపతులు వాపోతున్నారు.

పారదర్శకంగా పరిహారం

తుపాను పరిహారం అంచనా విషయంలో కలెక్టర్లు, అధికారులు అత్యంత మానవతాదృక్పథంలో వ్యవహరించాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటలు దెబ్బతిన్నచోట మళ్లీ పంటలు వేసుకోడానికి 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలన్నారు. పట్టణాలు, పల్లెలతో సంబంధం లేకుండా ఎక్కడైనా ఇళ్లు ముంపుకు గురైతే ఆ కుటుంబానికి రెండువేల రూపాయలతో పాటు, రేషన్ అందించాలన్నారు. పశువులు చనిపోతే సత్వరమే చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం అంచనాల నమోదు ప్రారంభించి వారం రోజుల్లో సాయం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ ఎం.హరినారా యణన్, ఎస్పి వై.రిశాంత్‌రెడ్డి, జెసి డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ప్రాథమిక అంచనా ప్రకారం వ్యవసాయ రంగంలో 26 మండలాల్లో 170 గ్రామాల్లో 3,384 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. ఉద్యానవన శాఖకు సంబంధించి 149.6 హెక్టార్లలో టమోటా, బంగాళదుంప, మిరప దెబ్బతింది.

సిపిఎం అభినందనలు

చిత్తూరుఅర్బన్: మండోస్ తుపాన్ ప్రభావం జిల్లాలో తీవ్రంగా ఉన్నప్పటికీ కలెక్టర్ జిల్లాలోని అధికార యంత్రాంగాన్ని ముందుగా అప్రమత్తం చేయడం వలన ప్రజలు క్షేమంగా ఉన్నారని, అధికారులకు సిపిఎం చిత్తూరు జిల్లా కమిటీ అభినందనలు తెలియజేసింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ గత అనుభవాలను దష్టిలో పెట్టుకొని జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారని తెలిపారు. జిల్లా 31 మండలాల్లోనూ అధికారులు అప్రమత్తంగా ఉన్నారన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వర్షంలో పర్యటన చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ, మరోపక్క చిత్తూరు నగరంలో మహిళా అధికారిని కమిషనర్ వర్షంలోనూ పర్యటన చేస్తూ చిత్తూరు నగర ప్రజల ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని పిల్లలు, ముసలి వాళ్ల మహిళలు వర్షానికి బయట తిరగవద్దని విజ్ఞప్తి చేశారు.

కల్వర్టుల వద్ద రాత్రిపూట నిఘా : కమిషనర్

అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో నగరపాలక అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ డా. జె అరుణ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో సోమవారం నీవా నది పరివాహక ప్రాంతాల్లో కమిషనర్ విస్తతంగా పర్యటించి పనులను పర్యవేక్షించారు. వీరభద్ర కాలనీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తేనెబండ ముత్యాలమ్మ ఆలయం, ఇందిరమ్మ కాలనీ, దోబీ ఘాట్, లిల్లీ వంతెన, నీవా నది వీధి ప్రాంతాల్లో పర్యటించి తాజా పరిస్థితిని సమీక్షించారు. నీవా నదిలో వరద వస్తే సత్వరం తీసుకోవాల్సిన చర్యలపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులకు మార్గనిర్దేశం చేశారు. నీవా నదిలో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా అడ్డంకులను, పూడిక మట్టిని జేసీబీలతో తొలగించే పనులు కొనసాగించాలన్నారు. నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున కల్వర్టుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, 24 గంటలు నిఘా ఉంచేలా సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో అన్ని నీటి సరఫరా కేంద్రాల్లో నీటికి తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, ఇతర ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక



నీవానది లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న నగర కమిషన్ అరుణ


పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి బ్లీచింగ్ చేయించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మి, డీఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

సిరుల 'పట్టు'

- మల్బరీ సాగుపై రైతుల ఆసక్తి
- ఈ ఏడాది 38వేల ఎకరాల్లో...
- ఆన్‌లైన్ మార్కెట్‌తో అధిక లాభాలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

వ్యవసాయ రంగం ఆధునికతను సంతరించుకుని కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ ఏడాది సెరికల్చర్ (పట్టు సాగు)పై రైతులు ఆసక్తి చూపి దాదాపు 38వేల ఎకరాల్లో సాగు చేసేందుకు సుముఖత చూపారు. గతంలో పట్టు సాగు చాలావరకూ ఇబ్బందులు కలిగించేది. వివిధ రకాల వ్యాధులు అరికట్టలేక, నీటి వసతి కరువై ఇబ్బందులు పడుతూ వచ్చారు.



మల్బరీసాగు



పట్టుగుడ్లు

ప్రస్తుతం పట్టు పురుగుల పెంపకం రైతులకు సిరులు కురిపిస్తోంది. ఏటేటా విస్తీర్ణం పెంచుతూ లాభాలు పెంపొందించుకుని రైతులు ముందుకెళుతున్నారు. ముఖ్యంగా కీటకాలు, ఏనుగులు ఈ పంట వైపు మళ్లే అవకాశం లేకపోవడంతో పడమటి మండలాల రైతులు సెరికల్చర్ సాగు వైపు మక్కువ చూపుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 21,600 మంది రైతులు దాదాపు 38వేల ఎకరాల్లో 29 మండలాల్లో సెరికల్చర్‌ను సాగు చేస్తున్నారు. గత ఆరు నెలల్లో 13,623 మెట్రిక్ టన్నుల పట్టు గూళ్లు ఉత్పత్తి చేసి దాదాపు 690 కోట్ల ఆదాయం పొందారు. ప్రధానంగా బైఓల్టిన్ రకం 2,764 మెట్రిక్ టన్నులు పండించారు. పట్టుదారం తీసి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేయడం ద్వారా 1500 మంది రీలర్లు ఉపాధి పొందుతున్నారు. ఈ పంట సాగులో దాదాపు ముగ్గురు లేదా నలుగురికి ఉపాధి సైతం లభిస్తుండటం గమనార్హం.

పలమనేరు సమీపంలోని చాకి పురుగుల పెంపక కేంద్రం. అలాగే కర్నాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో చాకీకి సంబంధించిన గుడ్లు లభిస్తున్నాయి. పడమటి మండలాల్లోని శీతల వాతావరణం ఈ పంట సాగుకు అనుకూలం. ఒక్కసారి మల్బరీ సాగు చేస్తే 20 ఏళ్లయినా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ పంటను కొనసాగించవచ్చు. ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న షెడ్లు దాదాపు 30 ఏళ్ల కాలపరిమితి ఉంటుంది. పట్టు పరిశ్రమకు ప్రధానంగా మల్బరీ ఆకు ముఖ్యమైనది. విత్తన కొనుగోలుకు ఇబ్బంది ఉండదు. ఎవరైతే మల్బరీ సాగు చేస్తున్నారో వారి వద్ద నుంచి కొమ్మలు తెచ్చుకుని ఒక్కో కొమ్మకు రెండు అడుగుల దూరం ఉంచి నాటతారు. మొక్కలు చెట్లుగా రూపాంతరం చెందడానికి నెలరోజులు సరిపోతుంది. మొక్కలలో ప్రధానంగా చిత్తూరు జిల్లాలో వి1, బరంపురం ప్రధానమైనవి. ఈ రెండు రకాలు రెండవ పంట రావడానికి నెల నుంచి నెలన్నర వ్యవధి మాత్రమే. ఒక్కో ఏడాదిలో ఆరు నుంచి తొమ్మిది పంటలను తీసుకునే అవకాశం మల్బరీ లో ఉంది. మొదట గుడ్లు తీసుకురావడం వాటిని పొదిగించడం గ్రామాలలోనే చేసేవారు.

విభిన్న వాతావరణ పరిస్థితులను దష్టిలో పెట్టుకొని చాకిపురుగుల కేంద్రం వారు వారి వద్దనే పురుగులుగా తయారు అయ్యేంతవరకు ఉంచుకొని రైతులకు ఇవ్వడం చేస్తున్నారు. ఈ విధంగా ఒక గాజు రింగు సైజులో ఉండే మల్బరీ గుడ్లను ఒకటిగా భావిస్తారు. అలా 100 గుడ్లు తీసుకువస్తే ప్రస్తుతం 80 కేజీల వరకు పట్టు గూళ్లు వస్తాయి. ఇందుకోసం ఏర్పాటు చేసుకున్న షెడ్లలో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా మల్బరీ పురుగుల పెంపకం సాగుతుంది. చివరి దశలోకి తిరిగి గూళ్ళు అల్లుకొని మనకు లాభాలు పెంచుతాయి. ఈ మొత్తం ప్రక్రియ 30 రోజుల్లోపు పూర్తి అవుతుంది. రెండు ఎకరాలలో మల్బరీ సాగు చేసేవారు సంవత్సరానికి 6 పంటలు తీస్తారు. 100 గుడ్లతో 80 కేజీల వరకు పట్టుగూళ్ళు ఉత్పత్తి అవుతుండగా ప్రస్తుతం ధరలు భారీగా ఉండటంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తోంది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాలలో పలు ప్రాంతాలలో గ్రామాలకు గ్రామాలే పట్టు పరిశ్రమపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఈ ప్రాంతాలు ఎక్కువగా అటవీ ప్రాంతాల వైపు ఉండడం, ఏనుగులు ఈ పంటను ఎక్కువ ఆశించకపోవడం ప్రధానంగా భావిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రోత్సాహకం బాగా ఉండటంతో మరింత విస్తీర్ణంలో పంట సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. జిల్లాలోని 31 మండలాలలో 27 మండలాల్లో పట్టు సాగు చేస్తున్నారు.

ఆన్‌లైన్ అమ్మకాలు

గతంలో పట్టుగూళ్ల మార్కెట్‌కు వెళ్లి మార్కెటింగ్ చేసుకునే పరిస్థితి ఉండేది. కొన్ని ప్రాంతాలలో అలా కాకుండా పట్టు దారం తీసే వ్యాపారస్తులు నేరుగా గ్రామాలలోకి వెళ్లి ముందే ధరలు నిర్ణయిస్తున్నారు. అయితే ఏరోజుకారోజు ఉన్న ధరలను ఆన్లైన్ ద్వారా తెలుసుకొని అమ్ముకుంటున్నారు. దీనివల్ల రైతులకు సిరికల్చర్ పంట సిరులు కురిపిస్తోంది.

డ్రిప్‌తో సాగుఖర్చు తక్కువ

సాగుకు అయ్యే ఖర్చు తక్కువ. ఒకసారి డ్రిప్ వేస్తే పది సంవత్సరాల పాటు ఉంటుంది కనుక నీటి తడులు కూడా దీనికి చాలా వరకు తక్కువగానే ఇవ్వాల్సి ఉంటుంది. వాతావరణం తోపాటు ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తుండడంతో రైతన్నలు ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఏనుగుల దాడి నుండి కాపాడుకున్నాం

మా గ్రామం అటవీ ప్రాంతంలో వుండడం వల్ల ఏనుగుల రాకపోకలతో పంటలు భారీగా దెబ్బతినేవి. ప్రతి పంట చేతికి వచ్చే వరకు నమ్మకం వుండేది కాదు. పంటలను నష్టపోయే మాకు పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, ఫారెస్ట్ అధికారులతో కలసి పట్టును ప్రోత్సహించడం వల్ల ఏనుగుల గుంపు నుంచి కాపాడుకొనే ప్రయత్నంలో భాగంగా పట్టు సాగు చేయడం ప్రారంభించాము. అధికారులు చెప్పిన విధంగానే పంటల వైపు రాకుండా పక్కకు వెళ్లిపోతున్నాయి. ధరలు బాగా పెరగడంతో పంటలు రెండు నెలలకోసారి తీయడం, పట్టు గూళ్ళు ధరలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో చూసుకుంటూ ఆ మార్కెట్ కి అమ్ముకోవడం జరుగుతోంది.



– సతీష్, రైతు,బేలుపల్లి,పలమనేరు మండలం

మల్బరీ సాగు విస్తీర్ణం పెంచుతాం

రాష్ట్రంలో పట్టు పరిశ్రమ పై పట్టు వున్న జిల్లాలలో చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉంది. పడమటి ప్రాంతాల్లో భారీగా పట్టు సాగు వుంది. రైతులకు ప్రస్తుతం మంచి ధర లభిస్తోంది. సంవత్సరంలో 5 లేదా 6 పంటలను తీసుకొంటున్నారు. మరింత విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.



శోభారాణి,జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి

'స్పందన' అర్జీలను పరిష్కరించాలి :కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన స్పందన కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీ దారుల నుండి మొత్తం అర్జీలు 61 అందాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు గైకొని పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.

నకిలీ హోంగార్డుల నియామక వ్యవహారంలో

ఏడుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: నకిలీ హోం గార్డుల నియామకం వ్యవహారంలో జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వన్‌టౌన్ సిఐ నరసింహరాజు నేతృత్వంలో విచారణ చేపట్టి ప్రాథమిక దర్యాపుత మణిగండన్, యువరాజ్, కిరణ్‌కుమార్, జయకుమార్, సుల్తాన్, సలీంభాషా, చిరంజీవిలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు జల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోంగార్డుల ఖాళీపోస్టుల భర్తీలో హోంగార్డుగా పని చేసే మణికంటన్, జిల్లా ఎస్పి కార్యాలయంలో హోంగార్డు ఇన్‌చార్జి జయకుమార్, జిల్లా ఎస్పి కార్యాలయ గుమస్తా కిరణ్‌కుమార్ కలసి ఎలాగైన అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వారికి పరిచయం ఉన్న వారి ద్వారా నిరుద్యోగులైన యువకుల నుండీ రెండు లక్షల నుండీ ఐదు లక్షల వరకు డబ్బులు వసూలు చేసి హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయ మాటలు చెప్పి వారిని నమ్మించి నకిలీ డ్యూటీ పత్రాలను సృష్టించి డ్యూటి టికెట్ ఇచ్చి పంపించేవారని తెలిపారు. ఈ విధంగా 2014-2019 వరకు సుమారు 87 మందిని వివిధ శాఖలలో హోంగార్డుగా పంపినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపారు. హోంగార్డుల నకిలీ నియామకాలపై చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఐపిసి 420, 419, 468,471 కేసులు నమోదు చేసి సమగ్రంగా విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వైసీపీ నేతలను విమర్శించే హక్కు టీడీపీకి లేదు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఉద్యోగ నియామకాలపై వైసీపీ నేతలను విమర్శంచే నైతిక హక్కు టీడీపీ నేతలకు లేదని వైకాపా విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు శశిదీప్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న కాలంలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన నేతలు విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే నాడు -నేడు పేరుతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగల భర్తీలో కూడా సాయశక్తుల కృషి చేస్తున్న నేతపై బురదజల్లడం మానుకోవాలని సూచించారు. తనదైన శైలిలో చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులపై అసత్య ఆరోపనులు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైకాపా యువత నాయకులు మునాఫ్, అజయ్, రాజేష్, చందులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు

విధుల పట్ల నిర్లక్ష్యం..

వార్డు కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు, స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు నగరపాలక పరిధిలో 28వ వార్డు సచివాలయం ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి వి.సతీష్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ నగర కమిషనర్ డా. జె అరుణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 28వ వార్డు సచివాలయం ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి వి.సతీష్ కుమార్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగడం లేదని ఫిర్యాదులు అందాయి. దీనిపై కమిషనర్ నగరపాలక సహాయ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించారు. విచారణ అధికారి ఇచ్చిన నివేదిక మేరకు వి.సతీష్ కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో వార్డు కార్యదర్శులు నిబద్ధతగా పనిచేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఈ సందర్భంగా కమిషనర్ స్పష్టం చేశారు.

స్పందనకు 154 అర్జీలు



విడియో కాన్ఫెరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, డి.ఆర్.ఓ ఎన్.రాజశేఖర్ లతో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 154 అర్జీలు అందాయి.

ఫిజికల్ ప్రోగ్రెస్ సాధించాలి

రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, నిర్దేశించిన కాలపరిమితిలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీవోలు, ఎంఈఓ లు నిరంతరం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, పనుల పురోగతిని పరీక్షించి నిధులు ఖర్చయ్యేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులను అప్లోడ్ చేయాలన్నారు. ప్రధానంగా జూనియర్ కళాశాలలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ ఎ ఏపీసి వెంకటరమణారెడ్డి మండలాల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయేందర్ రావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: మాండూస్ తుఫాను ప్రభావం వలన ఆరోగ్య సమస్యలు ఎదురవ్వకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జి. ప్రకాశం తెలియజేశారు. ముఖ్యంగా ఆరోగ్య సిబ్బంది తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలోని ప్రతి ఇంటిని సందర్శించి, వారు యొక్క ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. ఇంటిగ్రేటెడ్ డిసిజ్ సర్వలెన్స్ కార్యక్రమము ద్వారా ఎక్కడైన జ్వరాలు, వాంతులు, విరేచనాలున్నచో ముందస్తు ప్రణాళికల ద్వారా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు.నీటి ట్యాంకులను శుభ్ర పరచడం, అలాగే క్లోరిన్ మాత్రలను పంచాలన్నారు. గర్భిణీలుటుంటే దగ్గరలోని ఆస్పత్రులకు తరలించాలన్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలని తెలిపారు.



తలకోనలో నూతన నవగ్రహ విగ్రహాలు ఏర్పాటు



ప్రజాశక్తి-యర్రావారిపాలెం

ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం 6గంటల ప్రాంతంలో నూతన నవగ్రహ విగ్రహలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హాజరయ్యి నవగ్రహ విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేకం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కోనేరు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. వైసీపీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. జలపాతానికి వెళ్లే దారి అభివద్ధికి త్వరలో మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా తలకోన నాలుగు మాడ వీధుల అభివద్ధికి అన్ని విధాల ఆర్థికంగా ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉమామహేశ్వర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు కార్య నిర్వహణ అధికారి జయ కుమార్ పాల్గొన్నారు.

గతం పునరావృతమైతే కఠిన చర్యలు

35మంది స్మగ్లర్లు ఎస్పి ఎదుట బైండోవర్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

గతం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇకనుంచైనా మంచిమార్గంలో నడవాలని టాస్క్‌ఫోర్స్ ఎస్పి చక్రవర్తి అన్నారు. జాతి సంపదగా గుర్తించబడిన ఎర్రచందనాన్ని బయటి వ్యక్తులు అక్రమంగా దోచుకోడానికి ప్రయత్నాలు చేస్తుంటే అటువంటి వారికి సహకరించి స్మగ్లర్లతో చేయి కలపడం చట్టరీత్యా నేరమన్నారు. ఇకపై ఇలాంటివి ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సోమవారం తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఎర్రచందనం స్మగర్లు 35 మంది టాస్క్‌ఫోర్స్ ఎస్పి ఎదుట బైండోవర్ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో అరెస్టయ్యి, జైలు జీవితం గడపడం దుర్భరమన్నారు. మరోసారి నేరాలకు పాల్పడితే లక్ష రూపాయలు జరిమానా విధించి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇలాంటి నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లడం వల్ల కుటుంబాలు ఇబ్బందుల్లో పడతాయన్నారు. ఎర్రచందనం కోసం ఎవరైతే సంప్రదిస్తారో వారి వివరాలను టాస్క్‌ఫోర్స్‌కు ఇస్తే ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. నేరాలు చేసి జీవించే బదులుగా చిన్నపాటి వ్యాపారం చేసుకోవచ్చని, లేదా ప్రత్యామ్నాయంగా ఉద్యోగం చేసుకుంటే ప్రశాంత జీవనం చేసుకోవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సమాజంలో మంచి వ్యక్తులుగా పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు.


ఆన్‌లైన్‌లో లడ్డూలు... అవాస్తవ ప్రచారం

ప్రజాశక్తి - తిరుమల: టిటిడి వెబ్ సైట్ ద్వారా లడ్డూలు ఆన్ లైన్ లో బుక్ చేసుకోవచ్చని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవం, భక్తులు నమ్మరాదని టిటిడి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. టిటిడి వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో భక్తులు దర్శన టికెట్ బుక్ చేసుకునే సమయంలోనే పరిమితంగా అదనపు లడ్డూలు బుక్ చేసుకునే అవకాశం ఉంది. అంతేకానీ దర్శనంతో సంబంధం లేకుండా లడ్డూలు టిటిడి వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని జరుగుతున్న ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి. ఇలాంటి అవాస్తవ ప్రచారాలు చేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిరుపతి కాటన్‌మిల్లును పునరుద్ధరించండి : ఎంపి

తిరుపతి టౌన్: తిరుపతి కాటన్‌మిల్లును పునరుద్ధరించి టెక్స్‌టైల్ రంగానికి ప్రాముఖ్యత ఇవ్వాలని ఎంపి గురుమూర్తి అన్నారు. తద్వారా వెయ్యి కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. పునరుద్ధరణకు తగినంత పెట్టుబడి అవసరమన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కరోనా సమయంలో టెక్స్‌టైల్ రంగం కుదేలయ్యిందని, లాక్‌డౌన్ తరువాత సైతం తిరిగిపుంజుకోలేదని తెలిపారు. ఎపుడో మూతబడిన పరిశ్రమను పునరుద్ధరించి నిరుద్యోగ సమస్య తీర్చాలని కోరారు.

రేపు టీడీపీ కార్యాలయం ప్రారంభం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలోని భారతం మిట్ట సమీపంలో ఈనెల 14వ తేదీన నూతన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథిగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు పులివర్తి నానిని ఆ పార్టీ శ్రేణులు ఆహ్వానించారు. సోమవారం పార్టీ మండలాధ్యక్షుడు కామసాని లోకనాథరెడ్డి, జీడీ నెల్లూరు నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ గురుసాల కిషన్ చంద్ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. మండలంలోని నూతన పార్టీ కార్యాలయ స్థితిగతులను ఆయనకు నాయకులు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కోనేరు చెంగల్రాయరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావిళ్ల వెంకటాద్రినాయుడు, మొగిలయ్య, గుణశేఖర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, బోడిరెడ్డి రామకష్ణారెడ్డి, శివరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు పరామర్శ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని మొండి వెంగనపల్లి పంచాయతీ నెమలగుంట గ్రామంలోని ప్రత్యేక ప్రతిభావంతుడైన అయిన నాగరాజు తన భార్య, ఆరు నెలల పసి బిడ్డతో గత ఆరేళ్లుగా స్నానపు గదిలో కాపురం ఉంటూ దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. తుపాన్ కారణంగా రేకులు ఉరుస్తుండటంతో కనీసం పడుకోవడానికి స్థలం లేని పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ పొన్నా యుగంధర్ మండల నాయకులను ఆదేశించారు. దీంతో ఆ పార్టీ నాయకులు గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఇంటి స్థలం మంజూరైనా నిరుపేదతోపాటు దివ్యాంగుడు కావడంతో నిర్మాణం చేపట్టలేని దుస్థితి. అధికారులు స్పందించి అన్నివిధాలా నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: చర్చి పాస్టర్లకు నియోజకవర్గ టీడీపీ నేత గ్యాస్ రవికుమార్, ఇందుమతి దంపతులు గంగాధర నెల్లూరు చర్చిలో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతిని బోధిస్తున్న బోధకులకు క్రైస్తవ పర్వదినం సందర్భంగా నియోజవర్గ పరిధిలోని క్రైస్తవ బోధకులకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వెంకటేష్, రాజేంద్రన్‌లతో పాటు పలువురు క్రైస్తవ బోధకులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలో తుపాన్ ప్రభావంతో గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రావు తెలిపారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని.. వేడిగా ఉన్న పదార్థాలను తినాలని, నీటి ట్యాంకులన్నీ క్లోరినేషన్ చేయించి సరఫరా చేయిస్తున్నామన్నారు. ఎక్కడైనా జ్వరం, డయేరియా లాంటి ఆరోగ్యపర సమస్యలు వచ్చినట్లయితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నారు. చెరువులు నిండుతున్నందున ప్రజలు నీటి ప్రవాహంతో ఉన్న వాగులు, వంకలు దాటొద్దని.. రాత్రిపూట బయటకు రాకూడదని తెలిపారు.

'పేదల కడుపు నింపడమే టీడీపీ లక్ష్యం'

ప్రజాశక్తి-గంగాధనెల్లూరు: పేదల కడుపు నింపడం కోసమే టీడీపీ అన్నా క్యాంటీన్లను ప్రవేశ పెట్టిందని నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ చిట్టిబాబునాయుడు అన్నారు. గంగాధనెల్లూరు మండలం మహాదేవ మంగళం గ్రామానికి చెందిన మాజీ జిల్లా టీడీపీ బీసీసెల్ కార్యదర్శి నటరాజ్ మొదలి తల్లి రుక్మిణమ్మ ఎనిమిదో వర్ధంతి పురస్కరించుకుని, అలాగే తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు చెందిన జై శంకర్, ధరణి దంపతులకు పెళ్లి రోజు సందర్భంగా వారి సహకారంతో గంగాధరనెల్లూరు అన్నా క్యాంటీన్‌లో సోమవారం 150 మంది పేదలకు టీడీపీ నేతలతో పాటు చిట్టిబాబు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు స్వామి దాస్. శ్రీధర్ యాదవ్ , దేవసుందరం, మోహన్ నాయుడు, జాన్ ,జయప్రకాష్, గోపి , శంకర్ పాల్గొన్నారు.

వాగులు దాటొద్దు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మాండూస్ ప్రభావంతో పొంగి ర్లుతున్న వాగులు, వంకలను దాటేందుకు ప్రయత్నించకండని మండల తహసీల్దార్ అమర్‌నాథ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని గంగమాంబాపురం నుంచి కత్తెరపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న కుశస్థలీనదిని ఎంపీడీవో మోహన మురళీతో కలసి ఆయన పరిశీలించారు. మూడు రోజులపాటు కురుస్తున్న మోస్తారు నుంచి భారీ వర్షాలకు వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయని.. ప్రజలు నిర్లక్ష్యంతో వాగులను దాటేందుకు ప్రయత్నించి ప్రాణాలపైకి తెచ్చుకోకూడదని హెచ్చరించారు. ఇంకనూ 48 గంటల పాటు వర్ష సూచనలు ఉండటంతో ఎవరూ అనవసరంగా బయటకు రాకూడదని, అత్యవసర పరిస్థితులలో మాత్రమే రావాలని తెలిపారు.

పేదలకు 'ఇంటింటికీ వైద్య సేవలు'



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: ఇంటింటికీ పేదలకు వైద్య సేవలు అందించడాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్ పురం వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం మండలంలోని ముద్దుగుప్పం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వద్ధులకు వైద్యసేవలు అందించారు. బాలింతలకు, వికలాంగులకు, వద్ధులకు సలహాలు, సూచనలు అందించారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహాల సమస్యను సానుకూలంగా పరిష్కరించుకుందాం..!

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రంలోని శివాజీ నగర్ వద్ద వివాస్పదంగా మారిన అంబేద్కర్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాల ఏర్పాటు రెండు సామాజిక వర్గాల మధ్య సంవత్సరం కాలం నుంచి ఘర్షణ వాతావరణం నెలకొనగా.. నియోజకవర్గం దళిత నేతలు సానుకూలంగా పరిష్కరించు కుందామని నిర్ణయించుకున్నారు. సోమవారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో సమావే శమయ్యారు. ఈ సందర్భంగా దళిత నేతలు, రెడ్డి సామాజిక వర్గంతో చర్చించి విగ్రహాల సమస్యలు త్వరలోనే పరిష్కరించుకుందామని.. అంతవరకు విగ్రహాల వద్ద ఎటువంటి కార్యక్రమాలు జరపకూ డదని.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించ రాదని ఇరువర్గాలకు తెలియజేశారు. మాల మహా నాడు రాష్ట్ర నాయకుడు కె.కన్నన్, కందస్వామి, శ్రీనివాసులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా వైసీపీ ప్రభుత్వం



ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: మాండూస్ తుపాన్‌లో నష్టపోయిన వారిని సకాలంలో ఆదుకొని వారికి నిత్యావసర సరుకులతో పాటు తాత్కాలికంగా రూ.2 వేలు అందించి ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ప్రజా సమస్యలు తెలిసిన ముఖ్యమంత్రి కావడంతో సకాలంలో ఆదుకున్నారని.. తుపాను కారణంగా నష్టపోయిన వారికి పునరావాసం కల్పించడమే కాకుండా వారికి భోజనంతో పాటు ఆర్థిక సాయం అందించారన్నారు. ఎస్ఆర్ పురం మండలంలో 21 మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున సోమవారం పంపిణీ చేశారన్నారు. ఈ సందర్భంగా షికారి కాలనీలో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు లేవని.. మౌలిక వసతులు లేవని.. ప్రభుత్వం తమను గుర్తించడం లేదని ఉపముఖ్యమంత్రి కి మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఉపముఖ్యమంత్రి నవరత్నాల్లో భాగంగా వెంటనే వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబ్యాంక్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, పెనుమూరు ఏఎంసీ ఛైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, పెనుమూరు విజయకుమార్, మాజీ జెడ్పీటీసీ గురువారెడ్డి, నాయకులు జనార్ధన్, విజయ్ కుమార్ రెడ్డి, కష్ణారెడ్డి, దిలీప్ రెడ్డి, మణి, గండు, కాలప్ప, తహసీల్దారు షబ్బీర్ బాషా, ఎంపీడీవో కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మాండూస్ తుపాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ శ్యామల శివప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ తెలిపారు. సోమవారం పూరిగుడిసెలో ఉండలేక ఇబ్బందులు పడుతున్న 20 ఎస్టీ కుటుంబాలకు రూ.2 వేలు చొప్పున అందించారు. వారిని పాలసముద్రం ఉన్నత పాఠశాలలో ఉంచి భోజనం, వసతులు కల్పించి దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు బాబు, ఎంపీడీవో విద్యావతి, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్రంలో సంక్షేమం, అభివద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పరిపాలన పార్టీలకతీతంగా సాగిస్తున్నారని చిత్తూరు జిల్లా శాసనమండలి సభ్యుడు, కుప్పం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి కేఆర్ భరత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొరివిమాకులపల్లి పంచాయతీలో 'గడపగడపకు .. మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాణి అశోక్‌తో కలిసి గ్రామాల్లో విస్తతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయా.. అంటే ప్రజలను అడిగి తెలుసుకున్నారు.స్థానిక సమస్యల పరిష్కారానికి కషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రామకుప్పం మండల పరిషత్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్ రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విజలాపురం బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, మండల పరిషత్ అభివద్ధి అధికారి రాధాకష్ణ, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హేమా చలపతి, మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, మండల సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వైకాపా ముఖ్య నేతలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి గడప గడపకు అభివద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని పలమనేరు శాసనసభ్యులు వెంకటేగౌడ తెలిపారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెద్ద చల్లారిగుంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.



ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలు సంతప్తికరంగా ఉన్నారని.. దీన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అనంతరం పెద్ద చలరకుంట పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. అంతకుముందు రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కేశవులు, ఎంపీపీ రెడ్డప్ప, ఎంపీడీవో రాజేంద్ర, బాలాజీ . సర్పంచ్ నారాయణరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శివప్ప, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ఘనంగా భారతీయ భాషా ఉత్సవ్

ప్రజాశక్తి-కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలోని తమిళ విభాగం డాక్టర్ విష్ణుకుమారన్ ఆధ్వర్యంలో భారతీయ భాషా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, 'మహాకవి భారతి'గా పేరొందిన సుబ్రహ్మణ్య భారతి జయంతి సభను నిర్వహించారు. సోమవారం వర్సిటీ ఎమెనో భవనంలో సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా వర్సిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకష్ణ, రెక్టార్ ఆచార్య టి.అనురాధ, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరు లోకనాథం తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య తుమ్మల రామకష్ణ మాట్లాడుతూ సుబ్రహ్మణ్య భారతి 1882 డిసెంబర్ 11న తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లాలో జన్మించారన్నారు. అత్యంత యుక్త వయసు నుంచి సంగీతం అభ్యసించడం ప్రారంభించారని.. పదకొండవ ఏటనే కవితలు అల్లడం నేర్చారని.. సరస్వతీ దేవి పేరిట 'భారతి' అన్న బిరుదును పొందారని తెలిపారు. ఈయన పట్టుదలతో 32 భాషలు నేర్చుకున్నారన్నారు. 1907 ఏప్రిల్ నాటికి ఆయన తమిళ వారపత్రిక ఇండియా, ఆంగ్ల వార్తాపత్రిక బాల భారతాలకు సంపాదకత్వం వహించసాగారని తెలిపారు. ఆయన తెలుగు భాషను 'సుందర తెనుంగు' అని కీర్తించారని పేర్కొన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య అనురాధ మాట్లాడుతూ ఆధునిక తమిళ సాహిత్యంలో మార్గదర్శకునిగా ఆయనను భావిస్తుంటారన్నారు. స్త్రీల హక్కులు, విద్యపై విస్తత స్థాయిలో చింతన చేశారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక వక్తలుగా ఆచార్య జె.వి.సత్యవాణి, డాక్టర్ జి.పద్మనాభన్ పాల్గొని సుబ్రహ్మణ్య భారతి జీవిత చరిత్ర గురించి తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య తుమ్మల రామకష్ణ కథలను వర్సిటీ స్కూల్ డీన్ ఆచార్య ఎమ్.ఎన్.వెంకటేష్ రచించి మాలూరు విజయ్ ఆధ్వర్యంలో నాటకాలుగా ప్రదర్శించి ప్రజలకు తెలియజేసేందుకు సంబంధించిన 'నకుల' పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. విద్యార్థులకు వక్తత్వ, వ్యాసరచన, పాటల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో అతిథిగా డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరి లోకనాథం, అధ్యక్షులుగా స్కూల్ డీన్ ఆచార్య బి.ఎస్.శివకుమార్, డా.జి.పద్మనాభన్, ఆచార్య టి.విష్ణుకుమరన్, ఆజాదీకా అమత్ మహోత్సవ్ నోడల్ ఆఫీసర్ డా.డి.మాబుని, బోధన బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి-గంగవరం: అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గంగవరం మండలం డ్రైవర్ కాలనీకి చెందిన సయ్యద్ కుమారుడు సాజీద్, అదే కాలనీకి చెందిన నారాయణప్ప కుమారుడు శివ కర్ణాటక నుంచి తీసుకొచ్చి డ్రైవర్ కాలనీ చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్ముతుండగా సమాచారంతో దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.25 వేలు విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



ప్రజాశక్తి-శాంతిపురం: స్థానిక తుమ్మిసి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 70 మంది హాజరు కాగా.. 30 మందిని వివిధ కంపెనీలకు సెలెక్ట్ చేశారు. కార్యక్రమంలో ఐటీఐ పుంగనూరు ప్రిన్సిపల్ శేషారెడ్డి , నేషనల్ ఐటీఐ కరస్పాండెంట్ కష్ణమ నాయుడు , వరుణ్, హేమంత్ కుమార్ , శాంతిపురం ప్రిన్సిపల్ నగేష్ పాల్గొన్నారు.

రాత్రుల్లో సచివాలయంలో విధులు

ప్రజాశక్తి- రొంపిచెర్ల: మండలంలో తుపాన్ కారణంగా సచివాలయ సిబ్బంది రాత్రుల్లోనూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి ఎంపీడీవో రాజేంద్ర మండల పరిధిలోని సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని చెరువులను, కాలువలను, లోతట్టు ప్రాంతాలను సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగ రాజు, రవిచంద్రబాబు, సచివాలయ సిబ్బంది కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సోమల: సోమల మండలంలో మాండూస్ తుపాన్ కారణంగా ముంపు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారంతోపాటు సర్పంచులు, అధికారులు మూడు రోజులుగా వసతులు కల్పించారు. సోమవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి డ్వామా పీడీ చంద్రశేఖర్ సోమల మండలంలోని తుపాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. పొదలకుంటపల్లి, కందూరు, నంజంపేట గ్రామాలలో పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి 29 మందికి ఆర్థిక సాయం అందించారు. తుపాన్ ప్రభావం పూర్తిగా తగ్గేవరకు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని.. చెరువులు, కుంటలు మొరవలు నదీ పరీవాహక ప్రాంతాలలో పర్యటించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని నంజంపేట, పొదలకుంటపల్లి ,కందూరు, సదుం ఎంపీడీవో కార్యాలయాన్ని నియోజకవర్గ ప్రత్యేకాధికారి డ్వామా పీడీ చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. మాండూస్ తుపాన్ కారణంగా విద్యుత్ సరఫరా, పంట నష్టం తదితర వివరాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సదుం ఎంపీడీవో వరప్రసాద్, తహసీల్దారు చంద్రశేఖర్, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో శివకుమార్, నంజంపేట సర్పంచ్ వెంకటరెడ్డి కార్యదర్శి సబితా, పొదలకుంటపల్లి సర్పంచ్, ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సోమల: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోవడంతోపాటు చెరువులు , వాగులు, వంకలు పూర్తిగా నీటితో నిండాయి. సోమవారం నియోజకవర్గ ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ మండలంలోని జీడి రేవులవంక, కందూరుఏరు, పొదలకుంటపల్లి, దలవాయి చెరువు ప్రాంతాలలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మాండూస్ తుపాన్‌తో ప్రజలకు ఆటంకం కలిగింది. జనసంచారం లేక రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి గత నాలుగు రోజులుగా ప్రజల కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఆటంకం కలిగిందని.. కోత దశలో వరి పైరుకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు వాపోయారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని పాతూరు నత్తం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సోమవారం దగ్గరుండి డి.ఎం.హెచ్.ఓ ఆదేశాల మేరకునీటి ట్యాంకులు శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ విజయ్ చందు , సర్పంచ్ రోజా శివశంకర్, పుష్పలత, అరబ్ జాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: మండలంలోని కందూరు ఏరు ఉద్ధతంగా ప్రవహిస్తూ రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. ఏటిపై కల్వర్టు నిర్మాణం కోసం తాత్కాలిక మట్టి రోడ్డు నీటి తాకిడికి కొట్టుకుపోయింది. సోమవారం మద్యం మత్తులో కందూరు ఏరును దాటే క్రమంలో నీటిలో పడిపోయి ఎట్టకేలకు సురక్షితంగా బయటపడ్డాడు. దీంతో అక్కడ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

లక్ష్మీపతియాదవ్‌కు సన్మానం



ప్రజాశక్తి-పలమనేరు: ఏపీఎన్‌జీవో చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులుగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన లక్ష్మీపతి యాదవ్ ను పలువురు ప్రముఖులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా పలమనేరు లారీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షులు జీలు బాయ్ తమ సన్నిహితులతో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ



ప్రజాశక్తి యాదమరి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ యూనియన్ 29వ రాష్ట్ర సర్వజన మహాసభ ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ ఆ యూనియన్ అధ్యక్షులు ఆస్కారావ్ ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉద్యోగంతో పాటు వైద్య ఉద్యోగుల సమస్యలపై పోరాడి వారికి న్యాయం చేసేందుకు కషి చేస్తానని తెలిపారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడంపై యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ సురేఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న అన్నిశాఖల సిబ్బంది లక్ష్మీనారాయణకు అభినందనలు తెలిపారు.



ప్రజాశక్తి-పూతలపట్టు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి



ప్రజాశక్తి-సోమల: తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని ఎంఈవో శ్రీరాములు తెలిపారు. సదుం సీఎల్ఆర్సీ సమావేశ గదిలో సోమల, సదుం, చౌడేపల్లి, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలకు చెందిన 9 మంది సీఆర్పీ ప్రధానోపాధ్యాయులు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలకు శిక్షణ తరగతులను తొలిరోజు రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సమాజాభివద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నతమైందని.. దేశాభివద్ధికి తరగతి గదిలో జరిగే బోధన పై ఆధారపడి ఉంటుందని, విద్యార్థుల సామర్థ్యం తగ్గితే పేదరికం పెరుగుతుందని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను పెంచుకొని విద్యార్థుల సామర్థ్యాల అభివద్ధికి తోడ్పడాలని ఎంఈవో కోరారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, గిరి, క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో మండల విద్యాశాఖాధికారి లీలారాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు 9 రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ కన్నయ్య, అడిషనల్ కోఆర్డినేటర్ అజయ్‌రెడ్డి, యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రీసోర్స్ పర్సన్ ఆన్సర్, గౌస్ బాషా, సీఆర్పీలు రంజిత్ కుమార్, అనిల్, హరిబాబు, రెడ్డెమ్మ, గీత పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతికి సంతాపం



ప్రజాశక్తి-రామకుప్పం: గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఆదివారం మతిచెందిన టీడీపీ సీనియర్ నేత వీర్నమల పంచాయతీ కి చెందిన హనుమంతు గౌండర్ భౌతిక కాయానికి సోమవారం కుప్పం నియోజకవర్గం పరిధిలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, కుప్పం శాసనసభ్యులు చంద్రబాబునాయుడు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. హనుమంత గౌండర్ మతి పార్టీకి తీరని లోటని ప్రకటన లో పేర్కొన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర తెదేపా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, ప్రధాన కార్యదర్శి రాజుపేట నరసింహులు, ముఖ్య నేతలు సత్యేంద్ర శేఖర్, గోపీనాథ్, గంటలగోడు, రామమూర్తి ,కామరాజ్ , గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బోడినాయనపల్లిలో జలదిగ్బంధంలో ఇళ్లు



ప్రజాశక్తి-పుంగనూరు: తుపాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరపిలేని వర్షాలతో బోడినాయనపల్లి చెరువు నిండి మొరవపోవడంతో సమీపంలోని ఇళ్లన్నీ జలదిగ్బంధంలో ఉన్నాయి. ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారం గ్రామానికి చేరుకుని పరిశీలించారు. ముంపునకు గురైన 15 కుటుంబాల వారిని రాంపల్లి పాఠశాలలో పునరావాసం కల్పించారు. మొరవ నీరు వెళ్లడానికి ప్రత్యేకంగా జేసీబీతో కాలువ వెడల్పు చేయడంతో నీరు వెళ్లేందుకు అవకాశం కలిగింది.